ఎట్టకేలకు ముందడుగు

- 12 ఎకరాల్లో స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణం
- సాయికుంటలో స్థలం కేటాయింపు
- జిల్లా క్రీడాకారులకు వరంగా మైదానం



సాయికుంటలో ఎంపిక చేసిన స్పోర్ట్స్ స్టేడియం స్థలాన్ని చదును చేస్తూ...

మంచిర్యాలటౌన్: జిల్లాలో క్రీడాకారులకు కొదువ లేదు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో వివిధ రకాల క్రీడలు, అథ్లెటిక్స్‌లలో జిల్లాకు చెందిన వారు రాణిస్తున్నా, కనీసం స్టేడియంను నిర్మించలేదు. ఉమ్మడి జిల్లాలోనే మంచిర్యాల తూర్పు జిల్లా కేంద్రంగా ఉండేది. ఆ సమయంలోనే జిల్లాకు మినీ స్టేడియంను వెయ్యి గజాల్లో ఏర్పాటు చేసేందుకు గాను ప్రభుత్వం 2014లోనే రూ.2.60కోట్ల నిధులు విడుదల చేసింది. బస్టాండ్ పక్కనే జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలోని స్థలాన్ని కూడా కేటాయించారు. స్టేడియం నిర్మాణం పనులు మొదలై, పిల్లర్లు వేస్తున్నప్పుడే పాఠశాలకు చెందిన పేరెంట్స్ కమిటీ కోర్టుకు వెళ్లగా, స్టే ఆర్డర్‌తో స్టేడియం నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఆ తరువాత మరోచోట స్థలాన్ని ఎంపిక చేయకపోవడం, ప్రత్యామ్నాయ మార్గాలు చూడకపోవడంతో నిధులు మూలుగుతుండగా, పదేళ్లుగా స్టేడియం నిర్మాణానికి నోచుకోలేదు. జిల్లాలోనే ఎక్కువగా క్రీడల్లో రాణిస్తున్న వారు ఉన్నా, వీరికి సరైన క్రీడా మైదానాలు లేకపోయినా, వారిలోని ప్రతిభతో రాణిస్తూ వస్తున్నారు. ఇతర జిల్లాల్లో స్టేడియాలు, క్రీడా మైదానాలు క్రీడాకారులకు అనుగుణంగా ఉండగా, ఈ జిల్లాలో మాత్రం క్రీడా మైదానాలు గాని, స్టేడియం గాని లేకపోవడంతో క్రీడాకారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏదైనా రాష్ట్రస్థాయి క్రీడలను నిర్వహించాలంటే, జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో తాత్కాలికంగా క్రీడల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు ఇక్కడికి వచ్చినా, వారు ఉండేందుకు ఏదో ఒక పాఠశాలను కేటాయించాల్సి వస్తోంది. స్టేడియం నిర్మాణం పూర్తయితే, అందులో క్రీడాకారులు ఆడుకునేందుకు అవసరమైన క్రీడాకోర్టుల ఏర్పాటుతో పాటు, క్రీడాకారులు భస చేసేందుకు అవసరమైన గదుల నిర్మాణం కూడా చేపట్టేందుకు అవకాశం ఉంది.

స్పోర్ట్స్ స్టేడియం ఏర్పాటుకు అడుగులు..

జిల్లాలో అన్ని రకాల క్రీడల్లో పలువురు ప్రావీణ్యం సాధిస్తున్నారు. కోల్‌బెల్ట్ ప్రాంతం కావడం, అడవులు, పారిశ్రామిక ప్రాంతాలు, పల్లె, పట్టణాల కలబోతతో జిల్లా వ్యాపించి ఉంది. పల్లె, పట్టణ ప్రాంతాలనే తేడా లేకుండా ఈ ప్రాంతంలో కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, బ్యాట్మింటన్, బాక్సింగ్ వంటి ఎన్నో క్రీడల్లో క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణిస్తున్నారు. క్రీడా మైదానాలు, స్టేడియం వంటివి లేకపోయినా పలువురు క్రీడల్లో రాణించడం గమనార్హం. లక్సెట్టిపేటకు 1997లో స్పోర్ట్స్ స్కూల్ మంజూరైనా, రాజకీయ జోక్యంతో ఆదిలాబాద్‌కు తరలించారు. 2014లో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత మంచిర్యాలలో స్టేడియం నిర్మాణం కోసం రూ.2.60కోట్లను మంజూరు చేశారు. జెడ్పీ మైదానంలోని వెయ్యి గజాల స్థలాన్ని కేటాయించి, పనులు కూడా ప్రారంభించి, కోర్టు స్టేతో పనులు నిలిపివేశారు. ఖేలో ఇండియా సెంటర్‌ను జిల్లాకు కేటాయించగా, స్టేడియం లేకపోవడంతో తాత్కాలికంగా జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలోనే ఖేలో ఇండియా బాక్సింగ్ శిక్షణను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఖేలో ఇండియాలో భాగంగానే జిల్లాకు స్పోర్ట్స్ స్టేడియం మంజూరు కాగా, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు స్థల సేకరణను వేగవంతంగా చేసి, పనులను సైతం చేపడుతున్నారు. జిల్లా కేంద్రంలోని సాయికుంటలో 14ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించగా, అందులో 2ఎకరాలను ప్రభుత్వ నర్సింగ్ కాలేజీకి, 12ఎకరాలను స్పోర్ట్స్ స్టేడియం కోసం కేటాయించారు.

స్పోర్ట్స్ స్టేడియం.. క్రీడాకారులకు వరం..!

కేంద్ర ప్రభుత్వం ఖేలో ఇండియా పేరిట జిల్లాలో రాణిస్తున్న క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడల కోసం నిధులను విడుదల చేస్తోంది. 12ఎకరాల స్థలం కేటాయింపుతో స్టేడియం నిర్మాణంతో పాటు, అథ్లెటిక్స్ కోసం సింథటిక్ ట్రాక్, వాలీబాల్, హ్యాండ్‌బాల్ కోర్టులు, ఇతర క్రీడల కోసం అవసరమైన ఏర్పాట్లు చేసుకునేందుకు అవకాశం ఉంది. జిల్లాకు క్రీడల కోసం కేంద్రం నుంచి ఖేలో ఇండియా ద్వారా రూ.7 లక్షల నిధులు వచ్చినా, వాటిని ఖర్చు చేయలేని పరిస్థితి. క్రీడలను ప్రోత్సహించాలన్నా, క్రీడాకారులను తయారు చేయాలన్నా, స్టేడియంతో పాటు, క్రీడలకు స్థలాన్ని కేటాయించాలని పలు క్రీడా సంఘాలు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నాయి. ఎట్టకేలకు జిల్లాకు క్రీడా స్థలం కేటాయింపు, పనులు వేగవంతం అవుతుండడంతో, మరికొద్ది రోజుల్లోనే స్టేడియం నిర్మాణం పూర్తయ్యే అవకాశాలున్నాయి. పనులను వేగవంతం చేసేందుకు గాను ఈ నెల 3వ తేదీన స్థలాన్ని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు పరిశీలించి, పనులను వేగవంతంగా చేపట్టేందుకు అధికారులకు ఆదేశాలిచ్చారు.

కొనుగోలు కేంద్రం సందర్శన



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పడ్తనపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి సందర్శించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలకు వరిపంట వచ్చి 20రోజులైనా.. ధాన్యం కొనుగోళ్లు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. తరుగు పేరుతో ధాన్యం తూకంలో కోత పెట్టొద్దని, ఆరుగాలం కష్టించి పండించిన పంటకు మద్దతు ధర రాకపోవడంతో నష్టపోతున్నారన్నారు. ఈ సందర్భంగా ఎలాంటి కోతలు లేకుండా కొనుగోళ్లు చేటపడంతో పాటు అన్ని రకాల వడ్లకు రూ.500అదనపు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గడ్డం స్వామిరెడ్డి, ఎనగందుల కృష్ణమూర్తి, మోటపలుకుల తిరుపతి, వెంకటరమణారావు, మడిపెల్లి సత్యం, కొట్టె ప్రశాంత్, హనుమాండ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

దళారులకు అమ్మి మోసపోవద్దు

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు

లక్సెట్టిపేట: రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ఐబీ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రైతులు కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని దళారులకు అమ్మొద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని సూచించారు. సన్నవడ్లకు ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. ధాన్యం పూర్తిగా ఆరిన తరువాత తేమశాతం లేకుండా తీసుకురావాలని కోరారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని కోరారు. అనంతరం రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల నాయకులు ఎండీ ఆరీఫ్, పింగిళి రమేశ్, చెల్ల నాగభూషణం, గడ్డం త్రిమూర్తి, చింత అశోక్ పాల్గొన్నారు.

వైభవోపేతంగా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపన



ఎల్లమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

దండేపల్లి: మండలంలోని కొర్విచెల్మ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలు వైభవోపేతంగా నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు పాల్గొని ఎలమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత...

కొర్విచెల్మ గ్రామానికి చెందిన కొండగొర్ల మల్లయ్య ఇల్లు ఇటీవల అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. దీంతో ఆయన ఇంటిని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఆదివారం పరిశీలించారు. బాధితుడికి రూ.10వేల ఆర్థిక సాయం అందించి భరోసా కల్పించారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

బొగ్గుబావుల వేలం రద్దు చేయాలి



ర్యాలీ తీస్తున్న సీపీఎం నాయకులు

చెన్నూర్: తెలంగాణలో ఏర్పాటు చేసే నూతన బొగ్గుబావులకు వేలం రద్దు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తూ ఆదివారం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు బొగ్గుబావులను అంటగట్టాలని చూస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బోడెంకి చందు, రాజేశ్వరి, సమ్మక్క, నాగజ్యోతి, రేణుక, సత్యం, శ్రీనివాస్, బోదయ్య, బూదక్క ఉన్నారు.

నియామకం



సత్యనారాయణ

బెల్లంపల్లి: తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) కేంద్ర కమిటీ డెప్యూటీ జనరల్ సెక్రెటరీగా బెల్లంపల్లికి చెందిన సింగరేణి కార్మికుడు సిరిసెట్టి సత్యనారాయణ నియామకం అయ్యారు. సింగరేణిలో ఎలక్ట్రీషన్‌గా పనిచేస్తున్న సత్యనారాయణను డెప్యూటీ జనరల్ సెక్రెటరీగా నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కార్మిక సమస్యలపై అవగాహన ఉన్న సత్యనారాయణకు టీబీజీకేఎస్‌లో కీలక పదవిని కట్టబెట్టి సముచిత స్థానం కల్పించడంపై పలువురు ఆ సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మార్పీఎస్ కార్యవర్గం

దండేపల్లి: ఎమ్మార్పీఎస్ దండేపల్లి మండల కమిటీని ఆదివారం మండలంలోని మేదరిపేటలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మంతెన నవీన్, ఉపాధ్యక్షులుగా మహేందర్, రజినీకాంత్, ప్రధాన కార్యదర్శిగా ఆవుల శ్రీనివాస్, కార్యదర్శిగా రమేశ్, ప్రచార కార్యదర్శిగా రమణ, కోశాధికారిగా వినయ్‌రాజ్, సంయుక్త కార్యదర్శిగా అంజిత్, సహాయ కార్యదర్శిగా తిరుపతి ఎన్నికయ్యారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



లక్సెట్టిపేట: చెట్ల కొమ్మల కత్తిరింపు దృష్ట్యా ఈ నెల 18న (సోమవారం) ఉదయం 10 గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ గణేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

మహాసభ విజయవంతం చేయండి

కాసిపేట: ఉట్నూర్‌లో నవంబర్ 20న నిర్వహించే తుడుందెబ్బ ఉమ్మడి జిల్లా మహాసభను విజయవంతం చేయాలని తుడుందెబ్బ మండల అధ్యక్షుడు సంద్ర భూమయ్య పిలుపునిచ్చారు. మండలంలోని దేవాపూర్‌లో ఆదివారం మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. ఉట్నూర్‌లోని ఆదివాసీ భవన్‌లో ఉదయం 10గంటలకు సభ నిర్వహించనున్నట్లు, అనంతరం ఉమ్మడి జిల్లాలోని నాలుగు జిల్లాల నూతన కమిటీలు ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఆదివాసీ అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. తుడుందెబ్బ ప్రధాన కార్యదర్శి కుర్సింగ తిరుపతి, సిడాం శంకర్, పల్లె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్రలో కాంగ్రెస్ నేతల ప్రచారం



మానిక్‌రావు ఠాక్రేతో కలిసి ప్రచారం చేస్తున్న తెలంగాణ కాంగ్రెస్ నేతలు

పాతమంచిర్యాల: మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థుల గెలుపు కోసం తెలంగాణ కాంగ్రెస్ నేతలు ప్రచారంలో పాల్గొంటున్నారు. మహారాష్ట్రలోని యావత్మాల్ జిల్లాలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ గోవా ఇన్‌చార్జి మానిక్‌రావు ఠాక్రేతో కలిసి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవా దళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు, కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి సొంత భవనం కరువు..!

- అటవీశాఖ భవనంలో కొనసాగుతున్న వైనం
- ఇరుకుగదుల్లో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



అటవీశాఖ భవనంలో నిర్వహిస్తున్న తహసీల్దార్ కార్యాలయం

భీమారం: మండల కేంద్రంలోని అటవీశాఖ భవనంలో తాత్కాలికంగా తహసీల్దార్ కార్యాలయం నిర్వహిస్తున్నారు. అందులో ఉండాల్సిన అటవీశాఖ అధికారులు అద్దె భవనాల్లో ఉంటున్నారు. అటవీశాఖ 2015సంవత్సరంలో భీమారంలో విధులు నిర్వర్తించే అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్‌తో పాటు బీట్ ఆఫీసర్ల కోసం రూ.12లక్షలతో రెండు భవనాలను నిర్మించింది. అధికారుల కోసం నివాసం ఏర్పాటు చేసే లోపే భీమారం కొత్త మండలంగా ప్రకటించారు. దీంతో తాత్కాలికంగా కార్యాలయాలు నిర్వహించేందుకు మండల కేంద్రంలో ఖాళీ భవనాలు అందుబాటులో లేవని అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. అప్పటి కలెక్టర్ ఖాళీగా ఉన్న అటవీశాఖ నిర్మించిన ఆ రెండు భవనాలను ప్రభుత్వ కార్యాలయాల నిర్వాహణ కోసం అప్పగించాలని అటవీశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడారు. దీంతో ఇప్పుడు తహసీల్దార్ కార్యాలయం నిర్వహిస్తున్న భవనంలో పోలీస్‌స్టేషన్‌ను, బీట్ ఆఫీసర్ నివాస భవనాన్ని ఎస్సై నివాస గృహంగా కేటాయించారు. అయితే పోలీస్‌స్టేషన్‌కి సొంత భవనం నిర్మించడంతో అందులోకి మార్చగా, వేరే చోట ఉన్న తహసీల్దార్ కార్యాలయాన్ని పోలీస్‌స్టేషన్ ఉన్న భవనంలోకి మార్చారు. దాదాపు నాలుగు సంవత్సరాల నుంచి అందులో నుంచే రెవెన్యూ సేవలు అందిస్తుండగా, ఇరుకుగదులు ఉండటంతో కార్యాలయానికి వచ్చే రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా తహసీల్దార్ కార్యాలయానికి సొంత భవనం ఏర్పాటు చేసి ఇబ్బందులు పడకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వంతెన లేక రాకపోకలకు ఇబ్బందులు



భీమారం: మండలంలోని ఆరెపల్లి క్రాస్ రోడ్డు నుంచి ఎలకేశ్వరం ప్రధాన రోడ్డులో గల మంచినీళ్ల వాగుపై వంతెన నిర్మించకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వంతెన నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గిరిజనులు ఉండటం వల్లే పట్టించుకోవడంలేదని, చిన్నచూపు చూస్తున్నారని ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో నానా అవస్థలు పడాల్సి వస్తుందని, మంచినీళ్ల వాగుపై వంతెన నిర్మించి రవాణా సదుపాయం మెరుగుపర్చాలని కోరుతున్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందాలి

- అర్హులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేత
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



భీమినిలో కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్

వేమనపల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందేలా చూస్తామని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మాజీ జెడ్పీటీసీ ఆర్.సంతోష్‌కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాబీర్ అలీలతో కలిసి ఆదివారం నీల్వాయి, గొర్లపల్లి గ్రామాల్లో ఎస్‌డీఎఫ్ నిధులతో సీసీ రోడ్డు, సైడ్‌డ్రైన్ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం వద్ద వివిధ గ్రామాల నుంచి వచ్చిన 40మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, నాయకులు గాలి మధు, తిరుపతిరెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, కుర్రు వెంకటేష్, శంకర్‌గౌడ్, ముజ్జు, సంతోష్, నైతం శంకర్, సుధాకర్‌రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ

భీమిని: ఎంపీడీవో కార్యాలయంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదివారం కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన అర్హులైన వారికి కల్యాణ లక్ష్మి, షాదీముభారక్ చెక్కులను అందజేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు చేపడుతుందన్నారు. బిట్టూరుపల్లిలో ప్రాథమిక పాఠశాలకు రూ.ఎనిమిది లక్షల వ్యయంతో ప్రహరీ, డీఎమ్ఎఫ్‌టీ కింద మంజూరైన రూ.పది లక్షల వ్యయంతో గ్రావెల్ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఎమ్మెల్యేకు లక్ష్మీపూర్, రాజరాం గ్రామాలకు చెందిన గ్రామస్తులు పలు సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలు ఇవ్వగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

నేడు ప్రజాదర్బార్

బెల్లంపల్లి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం ప్రభుత్వ అధికారులతో కలిసి ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తెలిపారు. స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బెల్లంపల్లి ఏఎంసీ ఏరియాలో ఉన్న క్యాంపు కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ దర్బార్‌కు బెల్లంపల్లి డివిజన్ లోని ప్రభుత్వ శాఖల అధికారులు, మండల అధికారులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు.

'కంటి వైద్య శిబిరాలు మరిన్ని నిర్వహిస్తాం'

బెల్లంపల్లి: రాబోయే రోజుల్లో కంటి వైద్య శిబిరాలు మరిన్ని నిర్వహిస్తామని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తెలిపారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఆదివారం ఎమ్మెల్యే కూతురు వర్ష ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం దిగ్విజయంగా ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని అర్హులకు కళ్లద్దాలు అందజేశారు. కంటి వైద్య శిబిరంలో నెన్నెల మండలానికి చెందిన దాదాపు 1000మంది హాజరయ్యారని తెలిపారు. వీరికి ప్రముఖ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ అజయ్ పరీక్షలు చేశారని తెలిపారు. 100మందికి కంటి శస్త్ర చికిత్స చేసినట్లు తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గంలో మిగితా ఆరు మండలాల ప్రజల కోసం కూడా భవిష్యత్‌లో కంటి వైద్య శిబిరాటు ఏర్పాటు చేస్తానని స్పష్టం చేశారు. కంటి వైద్య శిబిరం విజయవంతం చేసిన నెన్నెల మండల ప్రజలకు, కాంగ్రెస్ నాయకులు, శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే సతీమణి రమ, కూతురు వర్ష, మున్సిపల్ కౌన్సిలర్ బి.ప్రభాకర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మల్లయ్య, మాజీ ఎంపీటీసీ హరీష్ గౌడ్, నాయకులు మునిమంద రమేశ్, దావరమేష్, గట్టు మల్లేశ్, కంకటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

కాసిపేట: మండలంలోని ధర్మరావుపేట యాదవసంఘం కమిటీ హాల్, ప్రహరీకి నిధులు మంజూరు చేయాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు యాదవసంఘం నాయకులు విన్నవించారు. యాదవసంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, నిధుల మంజూరుకు వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్, ముత్యాల రాజమౌళి, చిలువేరి రమేష్, చిన్నవేణి పవయ్య, బాషవేణి కొమురయ్య, చిన్నవేణి రవి, ముత్యాల భూమయ్య, లచ్చయ్య, ప్రవీణ్, శ్రీనివాసులు, తదితరులున్నారు.

ముగిసిన మదనంపోచమ్మ జాతర



జాతరకు తరలివచ్చిన భక్తులు

కోటపల్లి: మండలంలోని జనగామలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మదనం పోచమ్మ జాతర ఆదివారం ఘనంగా ముగిసింది. మూడు రోజులుగా మహిళలు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి కొత్తకుండల్లో వండిన పాయసాన్ని బోనాలుగా తీసుకెళ్లి అమ్మవారికి నైవేద్యం పెట్టారు. మంగళ హారతులతో డప్పుసప్పుళ్ల మధ్య దేవాలయ ప్రాంగనం సందడిగా తయారైంది. ఈ జాతరకు మహారాష్ట్రలోని పలు గ్రామాల ప్రజలతో పాటు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. మాజీ సర్పంచ్ లక్ష్మణ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో సౌకర్యాలు కల్పించగా ఎస్సై రాజేందర్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

ప్రమాదకరంగా బాదంపల్లి వంతెన



వంతెన మధ్యలో గుంత

జన్నారం: జన్నారం నుంచి బాదంపల్లికి వెళ్లే రోడ్డులో ఒర్రెపై నిర్మించిన పురాతన వంతెన మధ్యలో, వంతెన పక్కన గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఆదమరిస్తే వాహనాలు ఒర్రెలో పడే అవకాశాలున్నాయి. ఈ విషయంలో సంబంధిత అధికారులు దృష్టి సారించి, నూతన వంతెన నిర్మించాలని బాదంపల్లి గ్రామ పెద్దలు లక్ష్మణ్, రమేశ్‌గౌడ్, శ్రీనివాస్, తదితరులు కోరుతున్నారు.



వంతెన పక్కన కూలిన రోడ్డు